

# మీ కిష్టుడు

అవసరాల రామకృష్ణారావు

ఆ చిన్న అబ్బాయి స్టేషనులో ఒక చివర సిమెంటు బెంచీమీద కూచున్నాడు. క్రిందికి మొహంమీద పడుతున్న వెంట్రుకలూ, యింకొంచెం క్రిందికి చూస్తున్న కళ్ళూ, యింకా క్రిందికి ధారలుకడుతున్న కన్నీళ్లూ... యింకా బాగా క్రిందికి దిగి... ఆ అబ్బాయిగుండెల్లో లోతుకుకొలిస్తే—?

* * *

'ఏం బాబూ యింకా అలా కూచున్నావేం, నువ్వివాళ మాతో సినిమాకిరావా? ఇవాళ ఆఖరురోజు తెలుసా? నాకేం, మేం వెళ్ళిపోతున్నాంలే... అరే? అదేవిట్రా అంతలా తలదించుకు కూచున్నావ్?'

సుందరి కిష్టుడి తల పైకెత్తింది.

'అదేంరా, అంత విచారంగా ఉన్నావేంరా, ఏం యిక్కడ నీకు ఏం తక్కువొచ్చింది? చెప్పకుండా తీసుకొచ్చావనా? నాతో చెప్పవా, మీ బావ ఏమయినా అన్నారా? అంతేకదూ, నాతో చెప్పవ్ కదూ?'

'చెప్పడానికేవీ లేదమ్మగారూ!'

'అదిగో... అలా పిలవొద్దన్నానా... అక్కా అని పిలవమన్నానా... నామాట వినవన్నమాట... సరేలే'

'అలాగే పిలుస్తానక్కా...'

'ఊ, అలా దారికిరా... యిప్పుడు చెప్పు. ఎందుకలా ఉన్నావ్ అక్కణ్ణించి యిక్కడికి వచ్చావని బెంగగా ఉందా? కొత్తగా ఉందా?'

'అది కాదక్కా...'

'మరేవిటి? మీ నాన్నకోసం బెంగెట్టుకున్నావా?'

అడిగి అడిగి సుందరికి విసుగెత్తిపోయింది. పదిమాటలు అడిగితే ఒక్కమాటయినా సరిగ్గా జవాబు చెప్పడు... కనీసం కుర్రాళ్ళయినా గిత్తెలలా హుషారుగా ఉండాలి. బాధ్యతలూ సమస్యలూ పెద్దవాళ్ళవి. వీడి కుండే బాధలన్నీ తనిక్కడికి తీసుకురావడంతో తీరిపోయి ఉండాలి... అసలు వాణ్ని తనిక్కడికి తీసుకురావడమూ చిత్రంగానే జరిగింది...

ఎరిగున్నవాళ్ళ యింట్లో పెళ్ళంటే బెజవాడ వెళ్ళింది. అక్కడ ఆయన స్నేహితుడు ప్రసాదు ఉంటే చూద్దామని ఓసారి వాళ్ళింటికి వెళ్ళింది. తీరా సమయానికి ఆయన లేనే లేడు. ఆయన పెళ్ళాం సావిత్రి ఎంతో మర్యాదచేసి కూచోపెట్టి ఆకబురూ ఈకబురూ చెప్పింది. కొంతసేపటికి పాపాయి ఏడుస్తే 'ఒరేకిష్టూ, వీణ్ని తోపుడు బండీలో కూచోపెట్టి అలా గాలిలో తిప్పి తీసుకురా' అని ఓకుర్రాడికి యిచ్చింది. సుందరి తలెత్తి చూసింది. మాసిపోయినబట్టలూ, మలినమైన శరీరమూ... ఇవి కాదు... ఆవిణ్ణి ఆకర్షించిందీ ఆశ్చర్యపరిచిందీ ఆకుర్రాడి అతిలేత మొహం. ఆ కుర్రాడు వెళ్ళిపోయాక... ఆవిణ్ణి అడిగింది.

'ఇంత చిన్నకుర్రాడు మీకెక్కడ దొరికేడూ?'

'ఆఁ కనిపిస్తున్నంత కసిగందేం కాదు. పదేళ్లకు తక్కువవుండవులెండి... అయినా వాడు పైవాడేం కాదు. మాఅబ్బాయే...'

సుందరి ఆశ్చర్యాని కంతులేకపోయింది.

'అవునండీ, అంతఆశ్చర్యం దేనికి? వాడు ఆయన మొదటి భార్య కొడుకు. వాడికి రెండేళ్లుండగా తల్లి పోతే నన్ను మళ్ళీ చేసుకున్నారు...'

సావిత్రి మళ్లీ మాటాడింది.

'వాణ్ణి అలా చూస్తున్నానేమని అడుగుతారా?... పనిమనిషి క్రింద వాడుకుంటున్నానని ప్రశ్నిస్తారా? అక్కర్లేదు, నేనే చెబుతాను.. ఇది అతి సహజమైంది. నేను వాడి సవతితల్లిని... మరిచిపోయారా?'

'ఊరికే అన్నీ అలా అనేసుకుంటే నేనేం చెప్పను?'

'అందుకు కాదు... లోకం తీరు నేను చెప్పాను... ప్రపంచంలో సవతితల్లులు ఎలాగా పేరు పడనే పడిపోయారు... ఆ మాటే ఎందుకు కాదనాలి? నేను మరోలా చేస్తే నమ్ముతారా? వాడికి నాలుగు అక్షరమ్ముక్కలు రావాలని నేను విశ్వప్రయత్నం చేసేనంటే ఎవరేనా ఒప్పుకుంటారా?'

సావిత్రి నవ్వింది. ఆ నవ్వు సుందరికి



నచ్చలేదు...లేచి నిలబడింది. తిరిగి యింటికి వచ్చేస్తూంటే...ఆమెను దిగబెట్టడానికి వచ్చిన దాసీది మరికొన్ని చెప్పి, పిల్లల నెత్తినితల్లి హృదయాన్ని మరింత రగిల్చింది.

'ఇంకా యిప్పుడాయమ్మ బిడ్డ నెత్తింది, కాస్త నయం...అంతకుముందు చూడాలి తల్లీ ఆవిడ పెట్టిన బాధలు...రెండేసి రోజులు అన్నమే పెట్టేదికాదు, మూడేసి రోజులు గదిలోపెట్టి తీసేదేకాదు...కనిపించినచోటల్లా కదల బాదిచెయ్యడమేనా యింకేమేనా ఉందా?'

సుందరి మనస్సులో ప్రభవించిన ప్రవహించిన ప్రేమనెలువ ప్రళయరూపం దాల్చింది. అయితే ఆమె కోపం సావిత్రి మీద కాదు.

'ఆ అబ్బాయితండ్రి బ్రతికేఉన్నాడా?' అనిపించింది ఆమెకు. ఇంటికివెళ్ళడం మాని ఆఫీసుకే దారితీసింది. ప్రసాదు ఆవిణ్ణి చాలా ఆదరించాడు.

'మీ ఆదరాభిమానాలకి సంతోషం...కాని నేను అందుకు రాలేదు...ఒక్కమాట చెప్పడానికి వచ్చాను...ఎక్కువ చనువు తీసుకుంటే క్షమించండి...కాని అది నా విధిగా భావిస్తున్నాను...మీరు మీ అబ్బాయిని చూస్తూన్న పద్ధతి నాకేం నచ్చలేదు.'

'మీ అభిప్రాయం అది కావచ్చు. నాకేం అభ్యంతరం లేదు.'

'అంత తేలికగా మీరెలా తీసుకోగలుగుతున్నారు? తండ్రిగా మీ బాధ్యత మీకు లేదా? ఆ పిల్లాడు- అంత దిక్కుమాలి పోయాడా? ఆపిల్లాణ్ణి కన్నతల్లే బ్రతికివుంటే మీరిలా చెయ్యగలిగేవారా?'

'కాని ఆ తల్లి బతికి లేదుగా, అయినా నాకు కాలజ్ఞానం లేదుగా!' సుందరి మరమర చూసింది. 'చూడండి, జీవితాన్ని సీరియస్‌గా నేనెప్పుడూ 'వ్యూ' చెయ్యలేను. లల్లాశరీరమూ మనస్సూ కష్టపెట్టుకున్న మగ పగవాళ్ళకిసాయంకాలంయింటికివెళ్ళేక రెస్టు కావాలి. నేనింట్లో వుండేది కొన్ని గంటలూడి ఆ కొద్ది కాలమూ అందివరివి కానియ్యం. నేను సమస్యలు పరిష్కరించలేను తండ్రిగా నేనెప్పుడూ వాణ్ణి నా పెద్దకొడుకుగానే ప్రేమిస్తాను. ఒకగు చేసిన పనులకి నేరం యింకొకరిది కాదు. శాసించడంవల్ల సమస్యా పరిష్కారం ఆశించడం కేవలం భ్రమ అని నా ఉద్దేశం...ఇప్పటికేనా నన్ను అర్థం చేసుకున్నారా?'

'మిమ్మల్ని యిదివరకే అర్థం చేసుకున్నాను...మీ మాటలే అర్థంచేసుకో లేకుండా ఉన్నాను. సరే లెండి, దానికేం గాని మీ కిష్టుణ్ణి నాతో తీసికెళ్ళాలని ఉంది. మీకేం అభ్యంతరమా?'

'నామటుకు నాకేం అభ్యంతరం లేదు–'

'—సరేలెండి.'

సావిత్రి కూడా కొన్నాళ్ళపాటు వాణ్ణి తీసికెళ్ళడానికేమీ అభ్యంతరం చెప్పలేదు.

* * *

ఆ రోజు పడుకోబోయేముందు సుందరి భర్తతో అంది.

'ఆ మొగుడూ పెళ్ళాలకంటె ఈ పిల్లాడే ఎక్కువ చిత్రంగా ఉన్నాడు సుమండీ. మనసులో ఏముందో చెప్పడు, ఎందుకో చెప్పడు...వాణ్ణి సుఖపెట్టడానికి మనం చెయ్యగలిగినంతా చేశాం...ఎన్ని చేసినా ఆకుర్రాడు కొంచెమేనా కులాసాగా ఉన్నట్టు నాకేం కనిపించడంలేదు ... పిన్నిచేతి దెబ్బలే పిప్పరెంటు బిళ్ళలేమో...'

'అందుకే అలవాటుపడాడేమో ... కానియ్యి కాలమే నిర్ణయిస్తుంది' ఆ మాట నిజమే. మరో అరగంటకి ఆ యింటి తలుపు తెరుచుకుని కిష్టుడు యువతలి కొచ్చేశాడు. సుందరక్క కుట్టించిన రెండు కొత్త జతలూ సంచీలో పెట్టుకుని నెమ్మదిగా స్టేషనుకి వచ్చాడు. స్టేషనుదగ్గర కళ్ళీకొట్టువాడికి ఆ బట్టలు యిచ్చేసి రెండ్రూపాయలు పుచ్చుకున్నాడు. తన వూరికి టిక్కెట్టు కొనుక్కున్నాడు. అరరూపాయి మిగులుతే రబ్బరుబొమ్మ కొన్నాడు. సుందరక్క వచ్చేస్తుందా? తన్ని మళ్ళీ తీసుకెళ్ళిపోతుందా?

(93-వ పేజీ చూడండి)

# పాకీ కిష్టుడు

(23-వ పేజీ తరువాయి)

వాడిగుండె పీచు పీచుమంది. వాడి చెయ్యి పక్కనున్న సంచీమీద పడింది. సంచీలో రబ్బరుబొమ్మ కీచుకీచుమంది. ఫరవాలేదు. రైలు వచ్చేస్తుంది. ఎక్కి యింటికి వెళిపో వచ్చు. తను పిన్నితో ఎన్నిసార్లు ప్రయాణం చెయ్యలేదు గనక? కిష్టుడు కన్నీళ్లు తుడుచుకుని రబ్బరుబొమ్మని దగ్గిరగా తీసుకుని ముద్దెట్టుకున్నాడు.

ఈ బొమ్మ ఎవరిదీ?

ఈ సొమ్ము ఎవరికీ?

సరిగ్గా ఆరు నెలల క్రిందట...

*　　*　　*

దుర్భరమైన జీవితాన్ని ముందుకి లాగుకుంటూ, తోపుడు బండిని తోసుకుంటూ కిష్టుడు ఆలోచిస్తున్నాడు. నిస్సహాయమైన ఆత్మీయదేళ్ల బ్రతుకులోనూ ఆరోజే మొదటిసారిగా వాడి మనసు ఎదురు తిరిగింది. వాడి సహనం దెబ్బతింది. అమాయకంగా అయోమయంగా ఆకాశంవైపు చూసి 'అమ్మా' అని అనాడే వాడు మొఱ పెట్టుకున్నాడు.

అవాళ బజారు పని చేసి యింటికివస్తూ దార్లో మోళీ చూస్తూ కూచున్నాడు. అందరితోపాటు వాడూ చప్పట్లుకొట్టేడు. అంతా అయిపోయిందాకా అయిపోయిందేవిటో వాడికి తెలీలేదు. దాంతో యింటికి పరుగులంకించుకున్నాడు. దార్లో పడ్డాడు. గట్టి దెబ్బే తగిలింది. ఆలస్యం అయిందని యింటికి వెళ్లగానే పిన్ని వంద గుంజీలు తీయించింది. దెబ్బ తగిలిందని తియ్యలేకపోతే కొట్టింది. దెబ్బకూడా ఆ దెబ్బమీదే తగిలింది. అయినా ఆవిడ వదల్లేదు. పాపాయిని పడుకోబెట్టి తోపుడు బండి చేతికిచ్చి షికారు తీసికెళ్ళమంది.

తోపుడు బండి పక్కన ఇసుకలో కిష్టుడు తలకింద చేతులు పెట్టుకుని వెల్లకిలా పడుకుని హృదయవిదారకంగా అన్నీ చూశాడు. ఆకాశంలో పోటీపడుతూ ఎగురుతున్న నల్లని మబ్బులూ తెల్లని కొంగలూ చూసి ఆశ పడ్డాడు. ఆకుపచ్చని ఆకులూ ఎఱ్ఱని పువ్వులూ చూసి అసూయ పడ్డాడు. పసుప్పచ్చని జాకెట్టూ నీలంరంగు పరికిణీ కట్టుకుని తన పక్కనే గిరగిరాలు తిరుగుతున్న చిన్నపిల్లని చూసి ఆక్రందన చేశాడు. సహించలేని ఆకలితో వాడి మనసు ఆవురు మంది. భరించలేని వేదనతో వాడి మనసు బావురుమంది.

కిష్టుడు లేచినిలబడ్డాడు. అగాధమైన ద్రంలో వాడికి అమ్మ కనిపించింది. ఆ చల్లని తల్లిలోనే వాడికి స్థానం అనిపించింది. లేచి గబగబా నది వైపు నడిచాడు. రెండడుగులు నీళ్లలోకి దిగేడు.

'క్యారు, క్యారు'మని పాపాయి ఏడుపు వినిపించింది.

కిష్టుడు ఆగేడు-వెనక్కి చూసి ఆశ్చర్యపోయాడు.

తోపుడు బండిలోంచి పాపాయి కిందకి ఎలా దిగేడో దిగిపోయాడు. తన వైపు మెల్లిగా పాకి వస్తున్నాడు. ఏడుస్తున్నాడు. చెయ్యెత్తి పిలుస్తున్నాడు.

కిష్టుడు పరిగెత్తుకువచ్చి పాపాయి నెత్తుకున్నాడు. ఒళ్లంతా యిసక. తలనిండా యిసక...నోట్లో ముక్కులో కూడా యిసక. కిష్టుడు చొక్కా పెట్టి వాణ్ణి దులిపేడు.

పాపాయి నవ్వేడు.

కిష్టుడు వింతగా చూశాడు. మనసుకి గిలిగింతకొగా చూశాడు. ఆత్మకి పులకింతకొగా చూశాడు.

తన బట్టలు మాసిపోయాయని పక్కింటి చిట్టి నవ్విన నవ్వూ, తనకంటే బాగా చగువుకుంటున్నానని నున్నగా తల దువ్వుకుని నీటుగా బట్టలు వేసుకుని జోళ్ళు చప్పుడు చేసుకుంటూ వెడుతూ ఎదురింటి రామం నవ్విన నవ్వూ, పిన్ని తన వీపుమీద దెబ్బలు కొడుతూంటే చూసి దాసీ దాని కూతురు మల్లి నవ్విన నవ్వూ-ఈ నవ్వులన్నీ కలిపి నయాపైసకంటె తక్కువ. ఈ పాప నవ్వో? వేల నవ్వు, వరాల నవ్వు, వజరాల నవ్వు!

ఇన్నాళ్ళూ తనది పుట్టుగుడ్డి. ఇప్పుడు తనది దివ్యదృష్టి. పాలరాయిలాంటి, పావురాయిలాంటి పాపగారిని కిష్టుడు ఉక్కిరిబిక్కిరి అయేలా ముద్దు పెట్టుకున్నాడు. ఏడ్చేదాకా నవ్వించాడు. నవ్వేదాకా ఏడిపించాడు. బరువుగా బాధగా బండి తోసుకువచ్చిన కిష్టుడు నవ్వుతూ తేగుతూ పాడుతూ యింటికి వెళ్లి ఆలస్యమైందని పిన్నిచేత హాయిగా దెబ్బలు తిన్నాడు!

ఆనాటి మొదలు హిమాలయా సమభావంగా, నయాగరా నయగారంలా కిష్టుడి బతుకు చాలా హాయిగా నడిచింది. సంచీనిండా కూరల భారం వాణ్ణి క్రుంగదీస్తున్నప్పుడు సాయంకాలపు చక్కని భావం వాణ్ణి లేవనెత్తేది. ఎక్కువ దూరం నడవలేక కాళ్లు పీకుతున్నపుడు పాపాయి చల్లని తలపు సాయంచేసేది. పిన్ని తిట్లు విని భరించలేనప్పుడు, భాష్యంలేని పాపాయి భాష గానంచేసేది.

నాన్న వెళ్లమంటే దిగబెట్టడానికేమో అనుకుని సుందరక్కతో వెళ్లేడు గాని తన తోడూ నీడా విడిచి ఎవరుండగలరూ?


తను ఎక్కవలసిన రైలు వచ్చింది. ఇంక తనకీ, బొమ్మకీ భయంలేదు. ఎడంచేత్తో టిక్కెట్టూ కుడిచేత్తో సంచీపట్టుకుని కిష్టుడు రైలెక్కి కూచున్నాడు.

*　　*　　*

'అదేవిట్రా నాలుగురోజులకే వచ్చేశావూ?' అన్నాడు-ప్రసాదు.

'బాగుంది, మీ కలాగే ఉంటుంది..., ఆ కన్నతల్లి ఎంతచల్లనిదో వాడు లేకపోతే... ఉంటే తెలిసేదికాదు...నా ప్రాణం ఎంత కొట్టుకుందనీ...అసలు పాపాయిని ఎవరేనా పట్టుకో గలుగుతేనా?' ప్రసాదు సావిత్రి వైపు ఆశ్చర్యంగా చూశాడు. వీడు పిన్ని కిష్టుడు అయాడా? దాని మనసు మార్చగలిగేడా?

అవాళ సాయంకాలం నది ఒడ్డున పిన్ని కంటపడకుండా జాగ్రత్తగా దాచిన రబ్బరు బొమ్మను కిష్టుడు పాపాయికిచ్చాడు. పాపాయి రబ్బరు బొమ్మతో ఆడుకుంటున్నాడు. కిష్టుడు పాపాయితోఆడుకుంటున్నాడు. పైనున్న భగవంతుడు వీళ్లతో ఆడుకుంటున్నాడు! ★



చిత్రకారుడు: అబ్దుల్ సమద్ (గుడివాడ)